# జెన్ జీరో ఇంక్

– నిర్మలాదిత్య



## నాంది

*(లక్ష్మి సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ, ప్రపంచంలోని ఆర్థిక నేరాలు, అవి చేస్తున్న ప్రముఖ రాజకీయ నాయకుల, వ్యాపార వేత్తల పేర్లు 'పనామా పేపర్స్' ద్వారా బయట పెట్టింది ("క్షీర సాగర మథనం" కౌముది జనవరి 2023 నుంచి జనవరి 2024 వరకు వచ్చిన సీరియల్ నవల).*

అటు తరువాత –

లక్ష్మి తండ్రి విశ్వం అనుకున్నట్లే, ఈ నేరాలు చేసిన వ్యక్తుల పేర్లు తెలిసిన తరువాత కూడా, ఎక్కడో ఒక ఐస్ లాండ్ ప్రధాని శిక్షించ బడడం తప్పితే, మిగిలిన వారందరూ బాగానే ఉన్నారు.

భారత దేశంలో ఉన్న పారిశ్రామిక వేత్త పి.ఎల్. (పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) ప్రభుత్వం సహాయం తో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పి ప్రంపంచంలోని, బిల్ గేట్స్, ఎలన్ మస్క్ ల బిలియనీర్ల లిస్ట్ లో చేరి పోయాడు.

పి.ఎల్. కొడుకు అరసు(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు)తండ్రి అడుగుజాడల లో నడుస్తూనే ఉన్నాడు.

సిద్దార్థ(పనామా పేపర్లలో పేర్కొన బడిన నేరస్థుడు) పి.ఎల్ ఆర్థిక పెట్టు బడితో, తన కల్ట్ సినీ ఫ్యాన్స్ అండదండలతో భారత ప్రధాని పదవికి అతి చెరువులో ఉన్నాడు.

వినోద్ ప్రభుత్వ రంగంలో పని చేస్తూ, పి.ఎల్. లాంటి నేరస్తులను కేరీర్ మొత్తం పట్టుకోవాలని ప్రయత్నించి, విఫలమై రిటైర్ అయ్యి పోయాడు.

పి. ఎల్. స్నేహితుడు పీర్ క్యాన్సర్ తో చనిపోయాడు.

పీర్ కొడుకు డాక్టర్ సలీం తండ్రి క్యాన్సర్ కు కారణం పి.ఎల్ కంపెనీలు చేసిన కాలుష్యం అని తెలిసినా, పి. ఎల్. కట్టిన కొత్త పెద్ద హాస్పిటల్ కు డైరెక్టర్ కావడంతో, హామ్లెట్ మనస్తత్వం తో పని చేస్తూనే ఉన్నాడు.

పీర్ కూతురు ఆయషా, అరసు తో కలసి చదువుతున్నప్పుడు ప్రేమలో పడి, మనస్పర్ధల వల్ల బ్రేక్ అప్ అయ్యి, ఆ అనుభవం నుండి కోలుకొని లక్ష్మి కంపెనీకి పని చేస్తున్నది. అరసు ఎప్పుడో ఒక సారి మనసు మార్చుకొని తిరిగి అమెరికాకి తన దగ్గర వస్తాడని ఆశ. అది ఒక గొంతెమ్మ కోరిక అని తనకి తెలుసు.

లక్ష్మి మియామీ నుండి తన కంపెనీ టాంప బే లోని వెస్లీ ఛాపెల్ అనే సబర్బ్ కు మారింది. ఫ్లోరిడా రాష్ట్రంలో పూర్తిగా దక్షిణంలో ఉన్న మియామీ కంటే రాష్ట్రం మధ్యలో ఉన్న టంపా బే తన బిజినెస్ కు మంచిదని పించింది. తూర్పున ఓర్లాండో ఒక గంట ప్రయాణం, ఉత్తరం గెయిన్స్ విల్, రాష్ట్ర రాజధాని టాళ్ళహస్సీ, జాక్సన్ విల్, దక్షిణాన నేపుల్స్, మియామీ అన్నీ కారులో కొన్ని గంటల ప్రయాణాలే. పొద్దున్న పోయి పని చూసుకొని సాయంత్రానికి వచ్చేయ వచ్చు.

అలానే తండ్రి నివసిస్తున్న టార్పాన్ స్ప్రింగ్స్, బీచ్ టౌన్ లు క్లియర్ వాటర్, సెయింట్ పీటర్స్ బర్గ్, సరసోట అన్నీ లక్ష్మి ఉంటున్న వెస్లీ ఛాపెల్ కు ఒక గంట లోపు దూరంలోనే ఉన్నాయి. ఇవన్నీ టాంప బే సబర్బ్ లు.

లక్ష్మి తను టాంప బే మారడంతో కొత్త కంపెనీ జెన్ జీరో ఇంక్ పెట్టింది. ఆయషా, లక్ష్మి లకు కొత్త పనులు, ప్రాజెక్టులు వస్తూనే ఉన్నాయి. చేసిన ప్రతీ పని గొప్పగా చేయడం వల్ల కంపెనీకి పేరు రావడంతో బాటు మరింత ఛాలెంజింగ్ పనులు వస్తున్నాయి.

జెన్ జీరో ఇంక్ పనిచేసే ప్రాజెక్ట్ లు సామాన్యులకు అంతుబట్టని రహస్య ప్రపంచంలోనే ... )

# ‘పద పదవే వయ్యారి గాలిపటమా…’
# (ముగింపు)

(జరిగిన కథ: రిచ్ ఒక బ్యాంక్ లో అధికారి. అతను ఫ్రాడ్ చేసి పారిపోగా, ఆ కేసు ఎఫ్.బి.ఐ లో పనిచేస్తున్న లారెన్స్ చేతికి అందుతుంది. లారెన్స్ ప్రోద్భలంతో లక్ష్మి కంపనీ ‘ జెన్ జీరో ఇంక్ ‘ ఎఫ్.బి. ఐ. కి కన్సల్టెంట్ గా చేరుతుంది. లారెన్స్, లక్ష్మి కలిసి చేస్తున్న పరిశోధనలో రిచ్ చేసిన ఫ్రాడ్ వల్ల గ్రేట్ బుల్ అన్న కంపనీ లాభ పడిందని, ఆ కంపనీ అధికారి రతి కోసం ఆరా తీస్తే, ఆవిడ కూడా ఆఫీస్ కు రావడం లేదని తెలుస్తుంది. గ్రేట్ బుల్ కంపనీ బ్యాంక్ తో చేస్తున్న ట్రెజరీ బాండ్ల వ్యాపారంలో అవక తవకలు ఉన్నాయని, వాటి ఋజువు కోసం, ఈ ఫ్రాడ్ చేస్తున్న వ్యక్తుల కోసం లారెన్స్, లక్ష్మి లు పరిశోధన చేస్తున్నారు)

ప్రతీ నెలా కలిసే బ్యాంకర్ల మీటింగ్ స్టార్ హోటల్ లోని కాన్ఫరెన్స్ రూం లో పెట్టారు. ఆర్గనైజర్లు కాన్ఫరెన్స్ రూం ద్వారం దగ్గరే ఒక టేబుల్ వేసుకొని వచ్చిన వారందరి పేర్లు అర్.ఎస్.వి.పి లిస్టులో ఉందా, లేదా అని పరిశీలించిన తరువాతే లోపలకు అనుమతిస్తున్నారు. లారెన్స్ అక్కడికి చేరే సరికి, హోటల్ లాబీలో జేమ్స్ తనకోసం వేచి ఉన్నాడు. లారెన్స్ జేమ్స్ తో చేతులు కలిపి, అక్కడ మిగిలిన వారికి పరిచయం చేయాల్సి వేస్తే తనో ప్రభుత్యోగి అని చెప్తే చాలన్నాడు.

జేమ్స్, లారెన్స్ లు తమ పేర్లు చెప్పిన తరువాత, వారికి నేమ్ టాగ్ లు ఫ్రంట్ డెస్క్ వాళ్ళు ఇచ్చి, కాన్ఫరెన్స్ గది లోపలికి పోవడానికి అనుమతించారు. రూం చివర్లో ఒక చిన్న స్టేజ్ దాని పైన మాట్లాడ డానికి ఒక పోడియం, మైకు ఉన్నాయి. ప్రెజెంటేషన్ చేయడానికి, పెద్ద తెరలు, ప్రొజెక్షన్ పరికరాలు అవసరం బట్టి వాడుకోవడానికి అందుబాటులో ఉన్నాయి.

పోడియం ఎదురుగా కొన్ని రౌండ్ టేబుల్లు వేశారు. పోడియం దగ్గరున్న టేబిల్ దగ్గర కుర్చీలు ఖాళీగా కనిపించాయి. జేమ్స్ కి అక్కడ కూర్చున్న వారు తెలిసినట్లు ఉంది, నేరుగా ఆ టేబుల్ దగ్గరికే దారి తీసాడు. లారెన్స్ ను అక్కడి వారికి పరిచయం చేశాడు. అప్పటికే ఆ టేబిల్ చుట్టూ కూర్చున్న మరో ఐదు మంది తమను తాము పరిచయం చేసుకున్నారు. ఐదు మందిలో ముగ్గురు ఆడ వాళ్ళే. అందరూ వేరు వేరు బ్యాంక్ లకు పని చేస్తున్నారు. బ్రేక్ఫాస్ట్ మీటింగ్ కాబట్టి, పక్కనున్న బఫెట్ టేబిల్ నుంచి కావలసిన బ్రేక్ఫాస్ట్ తెచ్చుకొని తింటున్నారు, అందరూ. వెయిటర్ లు అందరికీ నీళ్ళు, ఫ్రూట్ జ్యూస్ లు, కాఫీ, టీ లు అందిస్తున్నారు. అప్పటికే వాటర్ బాటిల్ లు, రాసుకోవడానికి ఒక ప్యాడ్, పెన్ టేబుళ్ళ పైన పెట్టేశారు. లారెన్స్ కూడా బ్రెడ్ టోస్ట్, స్క్రాం బుల్డ్ ఎగ్స్ తింటూ, ఆ బ్యాంకర్లు చేస్తున్న సంభాషణలు విన సాగాడు. ఎక్కువ గా ఆ రోజు ముఖ్య అతిథి మానెక్ భాయి గురించే మాట్లాడు తున్నారు. వారి మాటలు వింటుంటే, మానెక్ భాయి కంపనీ లాంటి అకౌంట్లు బ్యాంక్ కు దొరకడం, ఒక అదృష్టంగా, తాము బ్యాంకులో పైకి పోవడానికి ఒక దోహద కారి అని వినిపించింది.

మానెక్ భాయి రూం లోకి వచ్చాడని, ఒక కొత్తగా వచ్చినతని చుట్టూ చాలా మంది చేరాడం లో బుజు వైపోయింది. అందరితో అతను అలా మాట్లాడు తుండగానే, సభ ప్రారంభం అవ్వు తున్నట్లు పోడియం దగ్గరికి వెళ్ళిన ఒక సూటు బూటు వేసిన వ్యక్తి అనౌన్స్ చేశాడు.

మానెక్ భాయి పోడియం దగ్గరికి పోగానే, అతనితో బాటు వచ్చిన మరొక వ్యక్తి, లారెన్స్ పక్కన ఖాళీగా ఉన్న కుర్చీలో కూలబడ్డాడు. ఆ కుర్చీ పోడియం కు దగ్గరగా ఉండడం ఒక కారణం కావచ్చు. కూర్చుంటూ, తను వేసుకున్న జాకెట్ తీసి కుర్చీ చేతులకు తగిలించాడు. లోపల తెల్లటి ఫార్మల్ షర్ట్, ఎర్రటి టై పైన ఈ జాకెట్ వేసుకున్నాడు. అందరూ

ఫార్మల్ గా సూట్, స్లాక్స్ తో వస్తే, ఇతను జాకెట్ తో ఎందుకు వచ్చాడు, అనుకున్నాడు లారెన్స్. వెంటనే లారెన్స్ చూపులను ఆ జాకెట్ ఆకట్టు కొనేసాయి. దానికి కారణం, ఖరీదైన మెటీరియల్ తో చేసిన ఆ నీలం రంగు జాకెట్టు ఎడమ ఛాతీ మీద అల్లిన బంగారు అక్షరాలు. ' ఎం. బి. యాట్ రిట్రీట్ '.

లారెన్స్ తలతిప్పి టేబుల్ చుట్టూ కూర్చున్న మిగిలిన వారి వైపు చూసాడు. అందరూ తన లాగానే, ఆ జాకెట్ పై రాసిన పదాలు చదవ ప్రయత్నిస్తున్నారు. అంత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదా జాకెట్.

జేమ్స్ లారెన్స్ తో మెల్లగా, "మా ప్రత్యర్థి బ్యాంకులో సీనియర్ ఎక్జిక్యూటివ్ అతను. మానెక్ భాయి బ్యాంక్ లలో సీనియర్ అధికార్లకు, రాజకీయ నాయకులకు సెమినార్లు అంటూ భారీ వేకేషన్లు, విదేశాల లోని టూరిస్ట్ ప్రదేశాలలో ఏర్పాట్లు చేస్తుంటాడు అని చెప్పాను కదా. దానికి ప్రవేశం కొందరికే సాధ్యం. అందుకే అలాంటి సెమినార్ కు తను పోయానంటు ఈ జాకెట్ ప్రదర్శిస్తున్నాడు. ఏం.బి. అంటే మానెక్ భాయి," అన్నాడు.

మానెక్ భాయి తను ఎలా మంచి స్టాక్ లను గుర్తించి ఇన్వెస్ట్ చేసి లాభాలు గడించ గలుగుతున్నాడో చూచాయగా వివరించాడు. దానికి తను నెలకొల్పిన రీసెర్చ్ విభాగం, ట్రేడింగ్ విభాగాల పై మాట్లాడారు. తరువాత ప్రశ్నలు, సమాధానాల సెషన్ లో చాలా మందే ప్రశ్నలు అడిగారు. లారెన్స్ కి మానెక్ భాయి ఇచ్చిన సమాధానాలు ఏమాత్రం సత్తువ లేకుండా, పై, పైనే ఉన్నట్లే అనిపించింది. ప్రశ్నలు అడిగే వారు కూడా, సమాధానాలు కంటే, మానెక్ భాయి దృష్టి ఆకర్షించ దానికే అడిగినట్లు అనిపించింది. లారెన్స్ జేమ్స్ కి తన ప్యాడ్ మీద, ' అతని వ్యాపారానికి కావలసిన ఫండింగ్ గురించి అడుగ ' మని రాసి చూపించాడు. జేమ్స్ ఆ ప్రశ్న అడిగితే, మానెక్ భాయి ఇచ్చిన సమాధానం దాటేసినట్లే ఉంది.

మీటింగ్ అయ్యి పోయిన తరువాత, లారెన్స్ జేమ్స్ నుండి వీడ్కోలు తీసుకొని, పార్కింగ్ లాట్ లోఉన్న తన కారుకు వెళ్ళాడు. మీటింగ్ ముందు, తరువాత లారెన్స్ తను కలిసిన బ్యాంకర్లతో మాట్లాడినప్పుడు గ్రేట్ బుల్ కంపనీ, సెక్యూరిటి వ్యాపారాల గురించి మాటల్లోనే ఆరా తీశాడు. కారులో కూర్చున్న వెంటనే, తన ఆలోచనలు, మైండ్ ఫ్రెష్ గా ఉన్నప్పుడే, మీటింగ్ లో జరిగిన విషయాలన్నీ ఒక ఆఫీస్ నోట్ గా ఫోన్ లోకి డిక్టేట్ చేశాడు. అటు తరువాతే కారు ఆఫీస్ వైపు కదిలించాడు.

మరుసటి రోజు ఆఫీస్ కు బయలు దేరుతూ, లక్ష్మి అప్పటికే తనూ రెడీ అయ్యి ఉండడం గమనించాడు. ఆ రోజు పొద్దున్నే లక్ష్మి తరువాతి ప్రెజెంటేషన్ ఉంది.

"లక్ష్మి నీకు సమయముందా? దారిలో 'పనేరా బ్రెడ్' లో బ్రేక్ ఫాస్ట్ చేసి వెళ్ళొచ్చు," అన్నాడు లారెన్స్.

"లవ్ ఇట్. అక్కడే ప్రెజెంటేషన్ ఒక సారి చెక్ చేసుకుంటాను," అని లారెన్స్ బుగ్గ పై ఒక ముద్దు గట్టిగా పెట్టింది.

వెంటనే ఇద్దరూ బాత్ రూం వైపు పరి గెత్తారు. లారెన్స్ టిష్యూ తీసుకొని తన బుగ్గ మీదున్న లక్ష్మి లిప్స్టిక్ మరకలు తుడిచేస్తుంటే, లక్ష్మి పెదాలపైన చెరిగిన లిప్స్టిక్ సరి దిద్దుకుంటున్నది. అలా లక్ష్మి తన పొడవాటి వేళ్ళతో నాజూకుగా, పెదాల కాన్వాస్ మీద ఒక కళా ఖండం పెయింట్ చేస్తున్నట్లు, లిప్స్టిక్ బ్రష్ లాగా కదుపుతుంటే, లారెన్స్ ఆగలేకపోయాడు

"ఎలా లిప్ స్టిక్ చెరిగి పోయింది కదా. నాకా పని వదిలేయి. పూర్తిగా చెరిపేస్తాను. నీవు తరువాత చక్కగా ఫ్రెష్ గా పెయింట్ చేసుకోవచ్చు," చిలిపిగా దగ్గర రాబోయాడు లారెన్స్.

"లేటర్," అంటూ నవ్వుతూ, ఒడుపుగా లక్ష్మి లారెన్స్ చేతులలో నుంచి తప్పించుకొని, "ఒక పది నిమిషాలలో పనేర లో కలుస్తాను" అని కారు దగ్గరకి పోవడానికి అపార్ట్మెంట్ బయట పడింది.

పనేరా చేరి తనకు బ్లూ బెర్రీ మఫ్ఫిన్, లారెన్స్ కి బేగెల్ తీసుకుని కిటికీ పక్కనున్న సోఫా టేబుల్ దగ్గర కూర్చుంది. వెనుకనే వస్తున్న లారెన్స్ అక్కడే ఒక పక్కనున్న హాట్ ఫ్లాస్క్ లో నుంచి లక్ష్మి కి హెజెల్ నట్, తనకు బ్లాక్ కాఫీ తీసుకొని, లక్ష్మి పక్కన సోఫాలో కూర్చున్నాడు.

లక్ష్మి తన ప్రెజెంటేషన్ చెక్ చేస్తూ, "గ్రేట్ బుల్ అకౌంట్లు దొరికిన తరువాత, నాకు ఏమి జరుగుతున్నదో అని అర్థం అయ్యింది," అంది.

"గ్రేట్. అలా అయితే ఇవ్వాళ నీ ప్రెజెంటేషన్ తరువాతే మనం ఈ కేసు క్లోజ్ చేయడానికి ప్రయత్నించ వచ్చు."

"అన్నట్టు నీవు వేగాస్ లో మా కజిన్లను కలవడానికి సూట్ కేస్ ప్యాక్ చేసుకున్నావా?" అడిగింది లక్ష్మి.

"ఆ చేసాను. సాయంత్రం ఫ్లైట్ . ఇంకా టైం ఉంది కదా. అయినా నీ కజిన్ ప్రోగ్రాం లిస్ట్ తో పాటు డ్రెస్ కోడ్ అన్నట్లు అన్ని డ్రెస్ లు తేమంటాడేమిటి?"

లక్ష్మి నవ్వేసింది. "చిట్టినా? వాడంతే. పార్టీ అంటే పార్టీ నే. వాడికి సోషల్ మీడియా పిచ్చి కూడా ఉంది. రోజుకో పది, ఇరవై బొమ్మలు ఇన్స్టా గ్రామ్ లో వేస్తే కానీ వాడికి నిద్ర పట్టదు. మీరంతా పిచ్చి వేషాలు వేయకండి, నాకు వెంటనే వాడి పోస్ట్ ల ద్వారా తెలిసిపోతుంది."

"మంచి విషయం చెప్పావు. మీ కజిన్ పోస్ట్ ల మీద ఒక చూపు వేస్తాను."

"మరో విషయం. నీతో టచ్ లో ఉన్న చిట్టిని మాత్రం ఇంప్రెస్స్ చేయడానికి ప్రయత్నం చేయి. వాడంటే మా అమ్మా, నాన్నలకు గురి. వాడు ఏ మాత్రం కష్టపడి నట్లు కన పడకనే, కాలేజీ పార్టీలన్నీ పాల్గొంటూ, ప్లాస్టిక్ సర్జన్ అయిపోయాడు. ఎప్పుడు మా ఇంట్లో వాడితో పోలికే!"

“అంటే ఆ చిట్టి కాదంటే వదిలేస్తావా?”

“వదిలేయమంటావా?” చిలిపిగా అడిగింది లక్ష్మి, "నిన్ను అంత సులభంగా వదలనులే. వాడు అడ్డంగా చెప్పితే నాకు మా అమ్మ నాన్నలను ఒప్పించడం కొంత ఆలస్యంగా అవ్వుతుంది. కానీ నువ్వు నీ చార్మ్ తో వాడిని పడేస్తావని నా నమ్మకం. అలా అయితే మన పెళ్ళి తొందరగా అయిపోతుందని వేసిన ప్లాన్ ఇది,” అంది లక్ష్మి.

బ్రేక్ఫాస్ట్ తొందరగానే ముగించి, లారెన్స్ ఆఫీస్ చేరారు, ఇద్దరు.

మొదటి ప్రెజెంటేషన్ కి వచ్చిన వాళ్ళే ఈ రోజు కూడా మీటింగ్ రూం లో ఉన్నారు.

లక్ష్మి మొదట రిచ్ ఇచ్చిన చెక్ డబ్బులు గ్రేట్ బుల్ దగ్గరి నుంచి ఎక్కడెక్కడ పోయిందో చూపింది. “ఆ చెక్ లను గ్రేట్ బుల్ వారు వెంటనే తమ బ్యాంక్ ద్వారా క్యాష్ చేసుకొంటున్నారు. ఇక గ్రేట్ బుల్ అకౌంట్లో నుంచి వెంటనే వేరు వేరు కంపనీ అకౌంట్లకు ట్రాన్స్ఫర్ అవుతున్నాయి. ఆ కంపెనీలలో సగం పైన కంపెనీల వివరాలు ఎక్కడా కనపడలేదు. వివరాలు దొరికిన కొన్ని కంపెనీలు స్టాక్ మార్కెట్ లో బ్రోకర్ లవి.”

“గ్రేట్ బుల్ ట్రెజరీ సెక్యూరిటీ లలో కదా వ్యాపారం చేసేది. స్టాక్ మార్కెట్ వ్యాపారం చేసే వారితో పని ఏముంది?”

“ నేను అందుకే ఒకటికి రెండు సార్లు ఈ బ్రోకర్ల ను, వారి అకౌంట్లను పరిశీలించాను. వారు కంపనీ స్టాక్ ల లోనే వ్యాపారం చేస్తున్నారు. ట్రెజరీ లలో కాదు.”

“ఇది అనుమానాస్పదం గానే ఉంది,” అన్నాడు లారెన్స్ మేనేజర్.

“ఇంకా ఆ ట్రెజరీ సెక్యూరిటీల ట్రేడింగ్ కూడా గందరగోళం గానే ఉంది. . ప్రభుత్వ ట్రెజరీ బాండ్ లు అమ్ముతున్నట్లు, ఆ రోజే రిజర్వ్ బ్యాంక్ లో రిచ్ వాళ్ళ బ్యాంక్ అకౌంట్లో కి ఆ బాండ్ లు మార్పిస్తాము అని గ్రేట్ బుల్ మరో బ్యాంక్ నుంచి తెచ్చిన హామీ పత్రం ప్రకారం రిజర్వ్ బ్యాంక్ లో ఆ మార్పులు ప్రతీ సారీ జరగటం లేదు. ఒక వేళ జరిగిన రిజర్వ్ బ్యాంక్ లో ఆ బ్యాంక్ మూసి వేసే కొన్ని నిముషాల ముందు చేస్తున్నారు. “

“మార్పులు రిజర్వ్ బ్యాంక్ లో జరుగక పోతే రిచ్ బ్యాంక్ వాళ్ళు ఆ రోజు తన అకౌంట్లు క్లోజ్ చేయలేరు కదా. తాము బాండ్లు తమకు అందకుండానే బ్యాంక్ డబ్బులు చేజారి పోయాయి అని బయట పడుతుంది.”

“అలా బయట కూడదనే, ఆ బాండ్లు జమ అయినట్లు, వాటిని మరో బ్యాంక్ కు అమ్మి రిచ్ వాళ్ళ బ్యాంక్ డబ్బు చేసుకున్నట్లు చూపెట్టే వారు”

“ ఇలా చేయడం వల్ల ఎవరికి లాభం?”

“మంచి ప్రశ్న. దానికి సమాధానం మనకు ఇంకా పూర్తిగా తెలియదు. ఒకటి మాత్రం స్పష్ట మైనది. రిచ్ వాళ్ళ బ్యాంక్ గ్రేట్ బుల్ కి ఇచ్చిన డబ్బు, ఆ కంపనీ వాడుకున్నట్లే అనిపిస్తున్నది. ఒక వేళ గ్రేట్ బుల్ కంపనీ పొద్దున్న రిచ్

వాళ్ళ బ్యాంక్ ద్వారా తీసుకున్న డబ్బు సాయంత్రానికి ట్రెజరీ లు అమ్మిన బ్యాంక్ కు ఇచ్చినా, ఆ పగలంతా ఆ డబ్బును గ్రేట్ బుల్ వాడుకొన్నట్లే కదా. అలా కాకుండా రిచ్ వాళ్ళ బ్యాంక్ ఆ ప్రభుత్వ బాండ్లు అందకనే, అంది నట్లు చూపి, ఆ రసీదు గ్రేట్ బుల్ ద్వారా మరో బ్యాంక్ కు అమ్మితే, గ్రేట్ బుల్ పంట పండినట్టే. ”

“అంటే వీళ్ళు తమ వ్యాపారానికి మొత్తం బ్యాంక్ డబ్బులే వాడుతున్నారు.”

“అవును మా నాన్న గారు ఇది వరకు బ్యాంకు లో పని చేసే వారు. దీనినే కైట్ ఫ్లయింగ్ అనే వారట. గాలిపటాలు ఎగర వేసి గాలిలోనే ఉంచే ప్రయత్నం చేసేటట్లన్న మాట. ఉదాహరణకి, ఒక కంపనీ రెండు బ్యాంక్ లలో ఖాతాలు తెరుస్తుంది. మొదటి బ్యాంకులో ABC కంపనీ ఖాతా, రెండో బ్యాంక్ లో XYZ ఖాతా తెరిచిందనుకుందాము. మొదటి బ్యాంక్ ABC ఖాతాలో జమ చేయమని మరో బ్యాంక్ XYZ చెక్ ఇస్తుంది. ఆ రోజులలో చెక్ మరో బ్యాంక్ కు చేరడానికి సమయం పట్టేది.ఆ సమయంలో మొదటి బ్యాంక్ నుంచి XYZ చెక్ విలువ పది లక్షలు అంటే, అంత డబ్బు తీసు కొని తమ వ్యాపారానికి వాడు కొనే వారు. రెండో బ్యాంక్ వారి దగ్గరికి XYZ చెక్ చేరినప్పుడు, ఆ బ్యాంక్ ఖాతా లో డబ్బు లేదంటే మొదటి బ్యాంక్ ABC చెక్ ఇచ్చేవారు. మళ్లీ ఆ చెక్ మొదటి బ్యాంక్ చేరడానికి ఒక రోజు పట్టేది. అలా చెక్కులు తిప్పుతూ, బ్యాంకింగ్ సిస్టమ్ నుండి తీసుకున్న పది లక్షలు, బ్యాంక్ కి కట్టకనే తమ వ్యాపారానికి వాడుకొనే వారు.”

“ మరి ఈ రోజులలో చెక్స్ వెంటనే క్లియర్ అయిపోతాయి కదా,” అన్నాడు రూం లో ఉన్న మరో అధికారి.

“అందుకే ఇలాంటి ఫ్రాడ్ లు రూపాంతరం చెంది గుర్తు పట్టడం మరి కొంత క్లిష్ట మయ్యాయి. ఇప్పుడు ఇలా ట్రెజరీ మార్కెట్ నుండి డబ్బు తీసి, స్టాక్ మార్కెట్ లో ఉపయోగిస్తున్నట్లు. అదే కాన్సెప్ట్. ఈ మొత్తం డబ్బు బ్యాంక్ వ్యవస్థ నుండి వస్తున్నట్లు తెలుస్తున్నది. గ్రేట్ బుల్ అప్పుకోసం ఏ బ్యాంక్ కు వెళ్ళినా కొన్ని వేల కంటే ఎక్కవ దొరకదు. ఒక వేళ ఆ అప్పు దొరికిన, దానిని తీసుకోవడానికి వందల కొద్దీ పేపర్లు చూపెట్టాలి, తమ వాటా గా పెట్టుబడి ఉండాలి, అప్పు దొరికిన తరువాత కూడా సవా లక్ష నియమాలు ఉంటాయి. ఇలాంటి ఫ్రాడ్ వల్ల అలాంటి సమస్యలు ఏమి ఉండవు. నిమిషాలలో మిలియన్ లు దొరుకుతాయి, రిస్క్ అంతా బ్యాంక్ లకే.”

“ఈ విషయం కోర్టులో ఋజువు పరచాలంటే ఇంకా ఏమి కావాలి లారెన్స్?” అడిగాడు లారెన్స్ మానేజర్.

“రిచ్ బ్యాంక్ లో తీసుకోబడిన డబ్బులు గ్రేట్ బుల్ కంపనీ కి, అక్కడినుంచి స్టాక్ మార్కెట్ లో పని చేస్తున్న కంపెనీలకు చేరాయి అని తెలిసింది. ఇప్పుడు ఆ స్టాక్ మార్కెట్ కంపెనీల నుంచి డబ్బు స్టాక్ మార్కెట్ కు ప్రవహించిందన్న ఋజువు కావాలి. అలానే ఈ మొత్తం స్కీమ్ నడిపిస్తున్న వారెవరో తెలుసుకొని, వారిని ఋజువు తో పాటు పట్టుకోవాలి.”

"మరి నీకు రొటీన్ తెలుసు కదా. ఆ పని మీద ఉండు. అలానే మన లీగల్ అట్టార్నీలను కూడా సంప్రదించు. వారే కదా చివరకు కోర్టులో జ్యూరీ ముందు వాదించేది."

"అవును. నాకు ఆ ఫండ్స్ ఎక్కడ ఎలా పోతున్నాయి అని తెలుసుకోవడానికి ఎలానూ సపీనాలు కావాలి. అలానే రిచ్, రతీ లాంటి వాళ్ళని ముందు పట్టుకోవాలి. వారిని పట్టుకోగలిగితే, వాళ్ళను బెదిరించి ప్రభుత్వం తో సహరించేటట్లు చేయవచ్చు. అలా చేస్తే ఈ ఫ్రాడ్ వెనుకనున్న వారెవరో తెలుస్తుంది. అలానే రతి, రిచ్ లు పంచుకున్న విషయాల బట్టి వారి శిక్ష ఎంతవరకు తగ్గించవచ్చో తెలుసుకోవాలి. జస్టిస్ అధికార్లను కలిసి వారితో మాట్లాడుతాను.ఆ పని మీదే ఉంటాను."

"హనీ, ఏం చేస్తున్నావు. పని అయిపోయిందా?" అడిగాడు లారెన్స్.

"ఇంకా ఆఫీస్ లోనే ఉన్నాను. మరో ప్రోజెక్ట్ మీద పని చేస్తున్నాను. ఇప్పుడే క్లైంట్స్ తో జూమ్ కాల్ అయ్యింది. నువ్వెక్కడున్నావు?" అంది లక్ష్మి.

"ఎయిర్పోర్ట్ లోనే. బోర్డింగ్ కాల్ కోసం ఎదురు చూస్తున్నాను. నీ వల్లే ఈ ట్రిప్. లేకపోతే హాయిగా ఇంకో గంటలో మన అపార్ట్మెంట్ లో ఉండి కబుర్లు చెప్పుకుంటూ ఉండే వారం కదా."

"బ్యాచిలర్ పార్టీకీ వెళ్తున్నావు. కబుర్లు చెప్పమాక. యూ విల్ హావ్ ఎ బ్లాస్ట్."

"నువ్వేదో ' హ్యాంగోవర్ ' సినిమాలు చూసి ఈ పార్టీలలో నేను కూడా అలా విచ్చల విడిగా ఎంజాయ్ చేస్తానేమో అని అనుకుంటున్నావు. నేను చేస్తున్న పని తెలుసు కదా. నో వే."

"నువ్వింకా మా కజిన్స్ ను కలవలేదు. పార్టీ అయ్యిన తరువాత ఈ మాట చెప్పు," గట్టిగా నవ్వేసింది లక్ష్మి.

"సరే అదీ విందువులే. ఎయిర్పోర్ట్ నుంచి సరాసరి నీ దగ్గరికే వస్తాను కదా. బోర్డింగ్ కి కాల్ చేశారు. క్యాచ్ అప్ సూన్," అని లారెన్స్ ఫోన్ కట్ చేసి ప్లేన్ ఎక్కాడు.

హ్యారీ రీడ్ ఎయిర్పోర్ట్ లో దిగ గానే, లక్ష్మి కజిన్ చిట్టి కి ఫోన్ చేసాడు. చిట్టి అప్పటికే అక్కడే ఎయిర్పోర్ట్ లో ఉన్న శుషి బార్ లో వచ్చిన గెస్ట్ లకు వెల్కమ్ డ్రింక్స్ ఏర్పాటు చేశాడు. లారెన్స్ ను కూడా అక్కడికే రమ్మన్నాడు.

లారెన్స్ ఆ బార్ చేరి తనను చిట్టికి పరిచయం చేసుకున్నాడు. చిట్టి అప్పటికే చేరిన మిగిలిన వారిని లారెన్స్ కి పరిచయం చేశాడు. అందులో కాబోయే పెళ్ళికొడుకు కమల్ పేరు మాత్రం అప్పటికే లారెన్స్ కి తెలుసు. మిగిలిన వారు, వారి పేర్లు కూడా కొత్తే.

లారెన్స్ సాల్మన్ తో చేసిన రెండు శూషి ముక్కలు ఆర్డర్ చేసి తింటూ, మిగిలిన వారితో మాట్లాడుతుండగా మరో ఇద్దరు వారి గుంపులో చేరారు. వారు కూడా అక్కడ డ్రింక్స్ తీసుకున్న తరువాత చిట్టి ఏర్పాటు చేసిన లిమోలో వాళ్ళ హోటల్ చేరారు. అప్పటికే రిజర్వ్ చేసినందువల్ల వాళ్ళ రూం కీ కార్డులు వెంటనే దొరికి పోయాయి.

"అందరూ ఫ్రెష్ అయ్యి, మరో అరగంటలో హోటల్ పై అంతస్తులో ఉన్న టెర్రస్ రెస్టారంట్ బార్ కి వచ్చేయండి. మీ అందరికీ ఇవ్వాళ, రేపటి ప్లాన్ చెప్తాను,"అన్నాడు చిట్టి.

లక్ష్మి అన్నది నిజమే. ఈ కుర్రాడు హైపర్ లాగానే ఉన్నాడు. కాలు నిలప లేక పోతున్నాడు. అక్కడా ఎయిర్పోర్ట్ లో రైస్ సాఖే లు ఒకటి తరువాత ఒకటి మాయం చేసాడు, అనుకున్నాడు లారెన్స్.

"నేను గమనించ లేదనుకోకు. ఎయిర్పోర్ట్ బార్ లో నువ్వు డ్రింక్స్ ఏది తాగ లేదు కదు. లక్ష్మి నాకు నీ మీదున్న అభిప్రాయం చెప్పమన్నది. జాగ్రత్త. ఈ సాయంత్రం బార్ లో యు హేవ్ టు పార్టీ!" చిట్టి లారెన్స్ భుజం తట్టి తన రూం కు పోయాడు.

లారెన్స్ ఫ్రెష్ అయ్యి రూఫ్ టాప్ రెస్టారంట్ కి చేరే సరికి దాదాపు అందరు ఒక పెద్ద టేబిల్ చుట్టూ చేరారు. చిట్టి ఏర్పాట్లు బాగానే చేశాడు. కమల్ పక్కనే సీట్ ఖాళీగా ఉండటంతో లారెన్స్ కమల్ పక్కనే కూర్చున్నాడు.

అందరూ డ్రింక్స్ ఆర్డర్ చేస్తుంటే, లారెన్స్ డైయట్ కోక్ ఆర్డర్ చేసాడు. ఎదురుగా చూస్తున్న చిట్టి కనుబొమ్మలు, ఇది సరి కాదన్నట్లు ఎగిరి పడ్డాయి. అందరూ కబుర్లలో పడ్డారు. చిట్టి తను వేసిన ప్రోగ్రాం మంచి కార్డ్ ల లాగా ప్రింట్ చేసి, ఆ కార్డ్ కు తగ్గ పెస్టెల్ రంగులో ఉన్న కవర్ లో పెట్టి అందరికీ పంచాడు. ఆ కార్డ్ తెరచి చదువుతున్న కమల్ ముఖంలో మారుతున్న రంగులు చూసి లారెన్స్ చిన్నగా నవ్వాడు.

"కార్డ్ చదివే కదా నీ నవ్వు," తనూ నవ్వు జోడిస్తూ అన్నాడు కమల్.

"అవును. మొత్తం బార్ హోపింగ్ ప్రోగ్రాం లాగానే ఉంది. మధ్యలో ఒక రెండు స్ట్రిప్ షోస్ కూడా వేశాడు. ఇవన్నీ నీకిష్టమా?" అడిగాడు లారెన్స్.

"నన్నడిగి వేస్తే కదా ప్రోగ్రాం. ఈ చిట్టి ఎప్పుడూ ఇంతే. పెద్ద చదువులు బాగానే చదివాడు కానీ, ఎప్పుడు వాడి గోలే. వాడికి నాకు కార్లు ఇంటరెస్ట్ అని తెలుసు. ఆ స్పీడ్ వేగాస్ సెంటర్ లో నాకు నచ్చిన రెండు మూడు కార్లు హైర్ చేసి అక్కడి రేస్ ట్రాక్ ల పై పరిగెత్తిస్తే అంతకన్న మజా ఏముంటుంది."

" అవును. ఎవరు వచ్చినా రాకపోయినా, మనిద్దరం పోదాం పద," అన్నాడు లారెన్స్.

"చిట్టి తో నేను మాట్లాడుతాను. తన ప్రోగ్రాం మార్చుకోడు. మనిద్దరం రేసింగ్ కు వెళ్ళామంటే నొచ్చు కొంటాడు. లక్ష్మితో నువ్వు కలుపుగోలు మనిషి కాదని చెప్తాడేమో."

"చిట్టి మాట వదిలేయి. తనని ప్లీజ్ చేయనవసరం లేదు. నేను నేనుగా ఉంటాను. నచ్చితే సరి, నచ్చక పోతే తరువాత ఏమి చేయాలన్న తంటా నేను, లక్ష్మి భరిస్తాం. ఇంతకీ నీ కు ఆ హై ఎండ్ కార్లు రేస్ చేయాలని ఉంది కదా. నేనే మనిద్దరికీ రేపు రిజర్వ్ చేస్తాను."

తరువాత ఇద్దరికీ కార్ల మీద ఇంటరెస్ట్ ఉన్నందు వల్ల కార్ల గురించి మాట్లాడుతూ, ఆ రోజు డిన్నర్ ముగించేసారు.

మధ్య, మధ్యలో చిట్టి ఇన్స్టాగ్రామ్ లో వేస్తున్న ఫోటోల వల్ల లారెన్స్ ఫోన్ వైబ్రేట్ అవ్వుతూనే ఉంది. లారెన్స్ ఆ బొమ్మలు అప్పుడప్పుడు చెక్ చేస్తూనే ఉన్నాడు. చిట్టి సెల్ఫీ లు తీసినప్పుడెళ్ళ జాగ్రత్త పడటం వల్ల తను ఇంత వరకు పోస్ట్ చేసిన ఫోటో లలో లేడు. ఉన్నా దూరంగా గుంపులో చూచాయగా కనిపిస్తున్నాడు.

మరుసటి రోజు అందరూ ఆలస్యంగా లేచి బ్రంచ్ చేస్తుండగా, చిట్టి విస, విస లారెన్స్, కమల్ కూర్చున్న చోటికి వచ్చి, " ఎంటి మీరిద్దరూ ఎదో రేసింగ్, అటుతరువాత ఎదో షోకి ప్లాన్ చేశారని టెక్స్ట్ చేశారు. అవేమీ పనికి రావు. కమల్, నీ కోసమే రీసెర్చ్ చేసి, ఏ బార్ లు, రెస్టారంట్ లు తిరగాలో ప్లాన్ చేసాను. రానంటే ఎలా? హే లారెన్స్ నీకు తెలుసు కదా, లక్ష్మి వాళ్ళకి నీవొక పార్టీ పూపర్, కలుపు గోలు మనిషి కాదని చెప్పనంటావా?" గుక్క తిప్పకుండా చెప్పేశాడు.

"చిట్టి నీవు వేసిన ప్లాన్ బ్రహ్మాండం. ఫూడీ లైతే తప్పక మెచ్చుకుంటారు. కానీ కమల్ కు రేసింగ్ అంటే ఇష్టమట. తనకోసం కదా ఈ పార్టీ. నీ ప్లాన్ మార్చు," అన్నాడు లారెన్స్.

కమల్ కూడా చిట్టి తో ఆ రోజు మధ్యాహ్నం తరువాత తన ప్రోగ్రాం తనదే అని, లారెన్స్ తో కలిసి రేసింగ్ కు వెళ్తున్నట్లు చెప్పేశాడు.

చిట్టికి ఈ మార్పులు నచ్చలేదు. లారెన్స్ చెప్పిన విషయంలో నిజం ఉన్నా, తన ప్రోగ్రాం అందరి ముందు మార్చుకోవడం నామోషీ గా అనిపించింది. తనకు తాను ఇచ్చుకున్న 'పార్టీ కింగ్' కిరీటం దించలేకపోయాడు. బింకంగా, "మీ పరుగులు మీరు తీయండి. మీకు లైఫ్ ఎలా ఎంజాయ్ చేయాలో తెలియదు. మనసు మార్చు కుంటే మాత్రం, మేము ఏ సమయంలో ఎక్కడ ఉంటామో ఆ ప్రోగ్రాం వల్ల మీకు తెలుసు. వెంటనే వచ్చేయండి," అంటూ మాట వినని టీనేజర్ పిల్లలకు పేరెంట్స్ చెప్పినట్లు చెప్పి వెళ్ళిపోయాడు.

"ఇక నీ పని అయిపోయింది, నీ మీద ఏ మాత్రం సదభిప్రాయం ఉన్నట్లు కనబడటం లేదు. యూ మనేజెడ్ టు రబ్ హిం ఇన్ రాంగ్ వే. వాడిని అనవసరంగా గోకావేమో? నీ గురించి మంచి మాటలు వాడు చెప్పడం సందేహమే," కమల్ చెప్పి నవ్వేసాడు.

"పోనీ నువ్వున్నావు కదా," నవ్వేసాడు లారెన్స్ కూడా.

ఆ మధ్యాహ్నం రేస్ ట్రాక్ కు వెళ్లారు. చాలా మాడెల్స్ ఉన్నాయి. కమల్ లాంబర్గినీ, ఫెరారి బ్రాండ్ల లో తనకు నచ్చిన రెండు మోడల్ కార్లు ఎన్ను కొని ట్రాక్ మీద డ్రైవ్ చేశాడు. లారెన్స్ పోర్ష ప్రేమికుడు. పోర్ష లోనే 718 కేమన్, 911 జి టి కార్లు నడిపాడు. సాయంత్రం బ్లూ మెన్ షో కమల్ చూడలేదంటే, ఆ షో కి వెళ్లి, స్ట్రిప్ మీద కొంత సేపు తిరిగి హోటల్ కి వచ్చి పడుకున్నారు.

అర్ధ రాత్రి తరువాత, రెండు గంటలకు లారెన్స్ తలుపు తట్టి నట్లు చప్పుడు వినిపించింది. కమల్ తో పాటు బ్యాచిలర్ పార్టీకి వచ్చిన మరో ఇద్దరు రూంలోకి వచ్చారు.

“చిట్టి తను మరో రెండు బార్ లు చూడాలని ఉండి పోయాడు, పన్నెండు కంతా హోటల్ కు తిరిగి వస్తానన్న వాడు ఇంకా రాలేదు. టెక్స్ట్ చేస్తే జవాబు లేదు, ఫోన్ చేస్తే ఎత్తటం లేదు,” రూం లోకి వచ్చిన ఒకతను లారెన్స్ తో అన్నాడు. అందరూ అతని తో పాటు మాట్లాడం మొదలెట్టారు.

“చిట్టి నీవు లా ఎన్ఫోర్స్ మెంట్ లో పని చేస్తున్నావు అని చూచాయగా చెప్పాడు. వివరాలు తెలియదు. ఈ పరిస్థితిలో నువ్వే సహాయ పడగలవనిపించింది. నేనే వీళ్ళను నీ దగ్గరికి తీసుకు వచ్చాను. మన తిరుగు ప్రయాణం పొద్దున్న 8 గంటలకు. మనం కనీసం ఆరింటి కల్లా చిట్టి నీ ట్రేస్ చేయాలి,” కమల్ అన్నాడు.

లారెన్స్ వెంటనే తన పర్స్, ఫోన్ తీసుకొని పైజామా డ్రెస్ తోనే వారి వెంట బయటకి వచ్చి, స్ట్రిప్ ని నాలుగు భాగాలు చేసి ఒక్కో భాగాన్ని ఇద్దరు ఇద్దరు గా వెదక మన్నాడు. అందరూ హోటల్ లాబీ చేరి టాక్సీ లు పట్టుకున్నారు.

లారెన్స్, కమల్ తన టాక్సీలో వెళ్తూ తాము చూడాలనుకున్న స్ట్రిప్ భాగంలో ఉన్న హోటల్ పేర్లు చిట్టి ప్రోగ్రాం లిస్ట్ లో ఉన్నాయేమో చూసారు. ఒక మూడు హోటల్స్ కనిపించాయి. మూడు వెదికారు, ఆ హోటల్ లలో ఉన్న రెస్టారెంట్స్, బార్లు, క్యాసినో లు అన్ని ప్రాంతాలు. దాదాపు రెండు గంటలు అయ్యింది. టైం చూస్తే పొద్దున నాలుగు గంటలు. మిగిలిన వారికి ఫోన్ చేసాడు లారెన్స్. ఎవరికి కనపడ లేదు. లారెన్స్ లో పైకి చూపక పోయినా కంగారు మొదలైయ్యింది.

కమల్ ను తీసుకొని హోటల్ ల వెనుక నున్న సర్వీస్ రోడ్ మీద టాక్సీ ని పొమ్మన్నాడు. అలా ఆ రోడ్డు పక్కన చూస్తుండగా చిట్టి లాంటి డ్రెస్ వేసుకున్న మనిషి ఒక ట్రాష్ బిన్ ఆనుకొని కూర్చున్నట్లు కనిపించింది. టాక్సీ ఆపి చూసారు. అది చిట్టి నే. లారెన్స్ దగ్గర పోయి చూసాడు. ఏవో గీసుకున్నట్లు కొన్ని దెబ్బలు తప్పితే చిట్టి బాగానే ఉన్నాడు. కాదంటే అతని పర్స్, ఖరీదైన రోలెక్స్ వాచి లేదు. బాగా తాగినందు వల్ల చిట్టి కి ఎక్కడున్నది స్పృహ లేదు. కమల్ సాయం తో చిట్టి ని టాక్సీలో కూర్చోబెట్టి, హోటల్ కు చేరారు. దార్లోనే మిగిలిన వారికి చిట్టి దొరికాడని, ఎవరో మగ్ చేశారని, బాగానే ఉన్నాడని, విషయం చెప్పి హోటల్ కు తిరిగి వచ్చేయమన్నారు.

మరుసటి రోజు ఎయిర్పోర్ట్ కు బయలు దేరిన చిట్టి అవతారం పూర్తిగా మారిపోయింది. పూర్తిగా ముభావంగా అయిపోయాడు. సెక్యూరిటీ దగ్గర మళ్లీ లారెన్స్ సహకారం తీసుకోవలసి వచ్చింది. రాత్రే, పోలీస్ స్టేషన్ వెళ్లి రాత్రి చిట్టి పోగొట్టుకొన్న వస్తువుల పట్టిక ఇచ్చి ఫిర్యాదు చేశారు. ఆ రిపోర్ట్ కాపీ ఒకటి చిట్టి ని తీసుకోమన్నాడు. రాత్రి పర్స్ పోగొట్టుకోవడం తో డ్రైవర్స్ లైసెన్స్, ఫోన్ కూడా పోయింది. హోటల్ వాళ్ళు చెక్ ఇన్ చేసినప్పుడు అందరి డ్రైవర్ లైసెన్సులు స్కాన్ చేశారు. లారెన్స్ చిట్టిని హోటల్ ఫ్రంట్ డెస్క్ నుంచి ఆ లైసెన్స్ కాపీ ఒకటి తీసుకో మన్నాడు. ఆ కాపీ నీ, పోలీస్ రిపోర్ట్ చూపెట్టి, ఎలానో లారెన్స్ చిట్టిని కూడా ప్లేన్ ఎక్కించ గలిగాడు.

ప్లేన్ ఎక్కుతుంటే చిట్టి , లారెన్స్ దగ్గరికి వచ్చి మెల్లగా, " ఈ విషయం మనలో నే వుంచుకుందాం," అన్నాడు. లారెన్స్ నవ్వి సమాధానం ఇవ్వలేదు. అప్పటికి ఈ విషయం అందరికీ కాకపోయినా, లక్ష్మి కి చెప్పాలనే అనుకున్నాడు. చిట్టి ప్రవర్తన లారెన్స్ కి నచ్చక పోవడం ముఖ్య కారణం.

లారెన్స్ కూర్చున్న తరువాత, ఆ రోజు వచ్చిన మేసేజిలు, పోస్ట్ లు చూస్తున్నాడు. చిట్టి లారెన్స్, కమల్ లేకుండా పోయిన ప్రదేశాల పోస్టు్లు కనిపించాయి. అవి చూస్తుండగా ఒక పోస్ట్ లారెన్స్ ను ముందుకు పోనీయ లేదు. అలా జరగడానికి కారణం చిట్టి ముఖం, చిట్టి విన్యాసాలు కాదు. ఆ పోస్ట్ లో చిట్టి వెనుకాల ఉన్న ఇద్దరు వ్యక్తులు. మొదట ఆకర్షించింది, ఆ ఇద్దరిలో ఒకరు వేసుకున్న జాకెట్. తరువాత ఇద్దరూ తనకు తెలుసిన వారే కావడం. అమ్మాయిని సులభంగానే పోలుచుకున్నాడు. మరొకతని లో మాత్రం బాగా మార్పులు ఉన్నాయి. గెడ్డం, మీసాలు ఉన్నతను ఇప్పుడు క్లీన్ షేవ్ తో ఉన్నాడు. వెంటనే గుర్తు పట్టడం కష్టమే. అసలు అమ్మాయి పక్కన లేక పోతే గుర్తు పట్టే వాడు కాదు. ఒకటికి రెండు సార్లు చూసాడు, లారెన్స్. ప్లేన్ దిగేటప్పుడు చిట్టి దగ్గరికి వెళ్లాడు.

"చిట్టి థాంక్స్. వర్రీ అవ్వద్దు, వాట్ హాప్పెన్స్ ఇన్ వేగాస్, స్టేస్ ఇన్ వేగాస్. నేనెవరి కి చెప్పనులే," అన్నాడు లారెన్స్.

చిట్టి ముఖంలో చిరు నవ్వు, రిలీఫ్ కనిపించాయి.

లారెన్స్ మనస్సు ఆహ్లాదంగా ఉంది. చెప్పలేని ఆనందం. లక్ష్మి లాంటి అందమైన గర్ల్ ఫ్రెండ్, నచ్చిన పని, పని లో దొరుకుతున్న విజయాలు, ఇంకా తెలీని ఎన్నో. ఫోన్ తీసి, లక్ష్మిని లంచ్ కు డౌన్ టౌన్ ఆఫీసు దగ్గరే ఉన్న లైలాక్ రెస్టారెంట్ కు రమ్మన్నాడు.

"డౌన్ టౌన్ వాటర్ స్ట్రీట్ లో కొత్తగా కట్టిన స్టార్ హోటల్ లో ఉన్న ఈ ఖరీదైన రెస్టారెంట్ కు పిలుస్తున్నావు. ఏమైనా రింగ్ ఇచ్చే సర్ప్రైజ్ లు పెట్టుకున్నావా?", అంది లక్ష్మి, లారెన్స్ ను ఎడిపిద్దామని.

"ఖరీదైనదని కాదు. ఈ మధ్యే మిచెలిన్ వారు స్టార్ రేటింగ్ ఇచ్చారు. ఫుడ్ బాగుంటుంది అని విన్నాను. కానీ సర్ప్రైజ్ అయితే ఉంది. లేకపోతే నిన్ను వెస్లీ ఛాపెల్ నుంచి ఇక్కడికి పిలవను."

"ఇప్పుడు సెయింట్ పీట్ లో క్లయింట్ ను కలవడానికి వచ్చాను. మంచి టైమింగ్ నీది. మళ్లీ వెస్లీ ఛాపెల్ కు డౌన్ టౌన్ మీదు గానే వెళ్ళాలి. దారిలో నిన్ను కలుస్తాను లే"

"సరే సీ యూ సూన్, హనీ"

లారెన్స్ రెస్టారంట్ చేరే సరికి, బాగా రద్ది గా ఉంది. ఎలా లక్ష్మి రాలేదు కదా అని, టేబిల్ ఇద్దరికీ కావాలని, రెస్టారంట్ లాబీ లో కూర్చున్నాడు. తను కూర్చున్న పది నిమిషాలలోనే లక్ష్మి వచ్చింది.

"వచ్చి చాలా సేపు అయ్యిందా. టూ మచ్ ట్రాఫిక్," లక్ష్మి లారెన్స్ ను కౌగలించుకోని అతని చెంప మీద మీద తన బుగ్గలు స్పర్శించింది.

"పరవాలేదు. ఇంకా టేబిల్ దొరకలేదు. కూర్చో," అని తన సోఫా పక్కన చూపించాడు.

"ఎంటి ఆ సర్ప్రైజ్ పార్టీ. చిట్టినీ ఇంప్రెస్స్ చేసేసావని ఆనందమా?"

"చిట్టినీ ఇంప్రెస్స్ చేయడం పెద్ద సమస్య కాదు. కానీ ఆ స్టేజి దాటాను కాబట్టి. అదీ ఒక కారణమే."

"సమస్య కాదంటావేమిటి? నాకు చిట్టి గురించి తెలుసు, నువ్వు అంతకంటే. వాడెలా నీ గురించి పెద్దగా పోగడడు, నేనే మా పేరెంట్స్ ని ఎలానో మేనేజ్ చేసి నిన్ను వాళ్ళతో పరిచయం చేద్దాం మనుకున్న. ఏమి మాయ చేసావు. చిట్టి నిన్ను ఒకటే పొగుడుతున్నాడు. అమ్మ, నాన్నల కు కూడా నీ గురించి చెప్పేశాడు. వాళ్ళు నన్ను నిన్ను ఎప్పుడు పరిచయం చేస్తారని అడుగుతున్నారు."

"వాట్ హాప్పెన్స్ ఇన్ వేగాస్ స్టేస్ ఇన్ వేగాస్," చిలిపిగా నవ్వాడు లారెన్స్," చిట్టి సంగతి వదిలేయి. నువ్వెప్పుడు రమ్మంటే అప్పుడే మీ పేరెంట్స్ ను కలుద్దాం. సెలబ్రేషన్ కి ఇంకో ముఖ్య కారణముంది."

"వచ్చే వారం, మనం మొదట డేట్ చేసిన రెస్టారెంట్ లో కలుద్దాం. మా అమ్మ, నాన్నలను తెస్తాను. మరి మరో కారణమేమి?"

లారెన్స్ కళ్ళు లక్ష్మి మాటలకు విచ్చుకున్నాయి. లక్ష్మి చేతులు, తన చేతిలో తీసుకొని మృదువుగా నొక్కాడు. "సో నెక్స్ట్ వీకెండ్ ఇట్ ఈజ్! ఎంత సంతోషంగా ఉన్నానో తెలుసా. మీ పేరెంట్స్ ను కలవడానికి, ఆమ్ సో ఎగ్జైటెడ్. ఇక కారణం అంటావా, మనం వెదుకుతున్న ఆ రతి, రిచ్ లు పట్టు బడి పోయారు. వాళ్ళను విచారిస్తే అన్ని విషయాలు బయట పడ్డాయి."

"ఎక్కడ ఎలా దొరికారు. కానీ ఇవన్నీ కోర్టులో ఋజువవ్వాలి కదా."

"రతి, రిచ్ లు దొరకడానికి మీ చిట్టినే కారణం. నే నీ మాట అన్నట్లు చిట్టికి చెప్పినా, అక్కడేమి జరిగిందో చిట్టి నోరు విప్పడు," చిలిపిగా నవ్వుతూ అన్నాడు లారెన్స్.

"చిట్టి సంగతి వదిలేయి. చిట్టి నీకు ఎలా సాయపడ్డాడు?"

"తమాషా ఏమిటంటే, చిట్టి ఈ కేసు కు ఉపయోగ పడినట్లు, తనకే తెలియదు. చిట్టి వేగాస్ లో ఉన్నప్పుడు, సోషల్ మీడియా లో తన పోస్టులు జాగ్రత్తగా పరిశీలించడం మొదలెట్టాను. దాంట్లో నా స్వార్థమే ఎక్కువ. తను తీసే సేల్ఫీ లలో నేను కూడా పొరబాటున ఉంటే, అది నా గురించి చెడుగా కనిపించ కూడదన్న స్వార్ధం. అలా చూస్తూ ఉంటే ఒక ఫోటోలో వెనుక రతి కనిపించింది. అతని పక్కన రిచ్. మొదట్లో రిచ్ ను గుర్తు పట్టలేదు. మొత్తం వేషం మార్చేశాడు. ఆ ఫోటో మా

వాళ్లకు పంపించాను. డిపార్ట్మెంట్ ఆ ఫోటోలో ఉన్నది, రతి, రిచ్ లు అని నిర్ధారించింది. వెంటనే వేగాస్ లోనే వాళ్ళని అరెస్ట్ చేయించాం."

"మరి వాళ్ళలో ఒకరైనా అప్రూవర్ కావాలి కదా."

"ఇద్దరూ ప్రభుత్వ సాక్షులయ్యారు. మొదట ఏమి తెలీదని చెప్పారు. వాళ్ళు చేసిన నేరాలు లెక్కబెట్టి, కనీసం నలభై ఏండ్లు జైలు పాలు అవ్వాల్సి వస్తుందన్న నిజం ముందు నిల బెట్టాం. సహకరిస్తే శిక్ష ఐదు ఎండ్లకు, వారి సహకారం నిజంగా ఉపయోగ పడితే, ఆ ఐదు ఏండ్లు కూడా జడ్జ్ తో మాట్లాడి సమాజ సేవతో సరిపెట్టేస్తామని చెప్పాం."

"అన్నిటికీ ఒప్పుకున్నారు కదూ?"

"అవును. నువ్వన్నట్లే బ్యాంక్ లతో ట్రెజరీ బాండ్ల వ్యాపారం అని మోసం చేసి, ఆ డబ్బులన్నీ స్టాక్ మార్కెట్ లో పెట్టి, విపరీతంగా డబ్బులు చేసుకున్నారు. ఈ ఫ్రాడ్ ను నడిపించింది మానెక్ భాయి అని కూడా ఒప్పుకున్నారు. అతన్ని కూడా ఇవ్వాళ మాట్లాడాలని మా ఎఫ్. బి.ఐ ఆఫీస్ కు పిలిచారు. ఇదిగో మన లంచ్ తరువాత ఆ పనిలోనే ఉంటాను. సాయంత్రం మానెక్ భాయి అరెస్ట్ కూడా బ్రేకింగ్ న్యూస్ అవ్వుతుంది."

"అంటే నా కాంట్రాక్ట్ కూడా ముగిసినట్లే కదా."

"అవును. నువ్వు, నీ కంపనీ మా ఆఫీస్ లో అతి తక్కువ సమయంలో మంచి పేరు కొట్టేశారు. ఇక ఈ కేసు ముగిసిన తరువాత నీకు మరింత డిమాండ్ ఉంటుంది."

"గ్రేట్. కానీ నాకు ఆకలి దంచేస్తున్నది. మరో సారి చెక్ చేద్దాం పద," అంది లక్ష్మి.

లారెన్స్ రెస్టారంట్ లో టేబిల్ ఎంత సమయానికి ఖాళీ అవ్వుతుందని విచారిస్తుండంగానే, అతని చూపులు ఒక టేబుల్ దగ్గర ఒంటరిగా కూర్చుని తింటున్న మనిషి మీద పడింది.

"ఆ చివర, రెండో టేబిల్ దగ్గర కూర్చొని తింటున్న వ్యక్తి నాకు తెలుసు. అతని ఎదురుగా ఒక కుర్చీ ఎలానూ ఖాళీగా ఉంది. ఇంకో కుర్చీ ఏర్పాటు చేస్తారా? మేమూ ఆయనతో కలిసి లంచ్ ముగించేస్తాము," అని లారెన్స్ అక్కడ రెస్టారెంట్ హోస్ట్ కి చెప్పి, లక్ష్మి తో పాటు ఆ వ్యక్తి కూర్చున్న టేబిల్ వైపు నడిచాడు.

" నా పేరు లారెన్స్. గత నెల బ్యాంకర్స్ మీటింగ్ లో మీ పక్కన కూర్చున్నాను. ఇది లక్ష్మి జెన్ జీ ఇంక్ కు యజమాని. నేను చేస్తున్న ప్రోజెక్ట్ కి కన్సల్టెంట్. మేము మీతో బాటు లంచ్ కి జాయిన్ కావొచ్చా?"

సమాధానం కోసం ఆగకుండా ఉన్న ఒక కుర్చీ వెనక్కు జరిపి లక్ష్మి ని కూర్చో బెట్టాడు లారెన్స్. ఇంతలో ఆ టేబుల్ అటెండెంట్ మరో కుర్చీ తెచ్చి లారెన్స్ కు వేసింది.

మిచెలిన్ అంతగా పొగిడిన ఓర కింగ్ సాల్మన్ లక్ష్మి ఆర్డర్ చేస్తే, ఫ్లోరిడా స్టోన్ క్రాబ్ లారెన్స్ ఆర్డర్ చేశారు.

లంచ్ చేస్తూ ఆ బ్యాంకర్ తో కూడా కబుర్లు వేసుకున్నారు. అతను ఇదివరకు చూసినట్లు ఉత్సాహంగా కనపడక పోవడంతో అదే విషయం అడిగాడు లారెన్స్.

"నువ్వు స్టాక్ మార్కెట్ లో ఇన్వెస్ట్ చేస్తావా?" అడిగాడు ఆ బ్యాంకర్.

"ఆ, అడపాదడపా. నేను డే ట్రేడర్ కాదు, స్టాక్ మార్కెట్ ఆటు పోట్లకి స్పందించడానికి," అన్నాడు లారెన్స్.

"నేను కూడా అంతే. నా డబ్బు ఇండెక్స్ ఫండ్స్ లో పెట్టేసి, స్టాక్ ఎక్స్చేంజ్ మార్పుల గురించి పట్టించుకోను," అంది లక్ష్మి.

"నేను స్టాక్స్ తో బాగానే ఆడుతాను. గత వారం వరకు మంచి లాభాలు వచ్చాయి. ఈ వారం స్టాక్ మార్కెట్ కూలిపోయింది. నాలా ట్రేడ్ చేస్తున్న అందరి ముఖాలు వాడి పోయే ఉంటాయి," రాని నవ్వును ముఖంలో పులుముకుంటూ అన్నాడా బ్యాంకర్.

"అవును మానెక్ భాయి మేజిక్ పోయినట్లు ఉంది. క్యాష్ ఫ్లో సమస్యల లో పడ్డాడని విన్న. అతని వల్లే స్టాక్ మార్కెట్ పడిపోయింది అని విన్నాను," లారెన్స్ కావాలనే ఎగదోస్తున్నా డని లక్ష్మి కి అర్థం అయ్యింది. కానీ కారణం అంతు బట్టలేదు.

"మానెక్ భాయి కి నేను చేస్తున్న ట్రేడ్స్ కి సంబంధం లేదు," హడావిడిగా అన్నాడు ఆ బ్యాంకర్.

"గత వారం వరకు మానెక్ భాయి ను అనుసరించి కొన్ని కోట్లు సంపాదించారు జనాలు. అందులో కొందరికి మానెక్ భాయి నుంచి ముందే ఏ ఏ స్టాక్స్ కొనాలన్నా సమాచారం అందిందని పుకార్లు ఉన్నాయి. ఒక వేళ అది నిజం అయితే మానెక్ భాయి తో పాటు అతని నుంచి లాభం పొందిన వారు కూడా ఇన్సైడర్ ట్రేడింగ్ నేరం మీద జైలు పాలు కావడం తప్పనిసరి," అన్నాడు లారెన్స్.

లారెన్స్ నుంచి ఈ మాటలు విన్న తరువాత, ఆ బ్యాంకర్ ముఖవళికలు బాగా మారి పోయాయి. గబ గబ లంచ్ ముగించుకొని, బిల్లు కట్టేసి, వీరిద్దరి వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయాడు.

"ఎంటి అలా బెదర గొట్టేసావు, ఆ అమాయకున్ని. అయినా మానెక్ భాయి కేసు ఇంకా బయట పడలేదు కదా. ఇంకా విచారణ లో నే ఉంది. అలా నీవు మాట్లాడినందు వల్ల, తను వెంటనే వెళ్ళి తనకు, మానెక్ భాయి కి ఒక వేళ సంబంధం ఉంటే, దాని ఋజువులన్నీ రూపు మాపేయొచ్చు కదా," అంది లక్ష్మి.

"సందేహం లేదు. నాకు ఆ బ్యాంకర్ కు మానెక్ భాయి కి సంబంధం ఉందని ఖచ్చితంగా తెలుసు. అతను తన దగ్గర ఋజువులు మాయం చేసి తప్పించుకోవాలనే నేను చెప్పాను. తనకు తెలీకుండానే నేను అతనికి చేస్తున్న ఫేవర్.,"

"అయినా నువ్వు ఎఫ్.బి. ఐ కి పని చేస్తూ, ఇలా నేరస్తుడిని తప్పించుకోవడానికి సహాయ పడడం తప్పు. "

" అతని వల్లే నేను ఈ కేసు సాల్వ్ చేయ గలిగాను. ఆ సంగతి అతనికి తెలియదు."

"ఎలా? నీ రిడిల్స్ మాని నేరుగా చెప్పు,"

"ఇది వరకు నేను బ్యాంకర్ల మీటింగ్ పోయినప్పుడు ఒక జాకెట్ వేసుకున్నాడులే. దాని మీద ' ఎం. బి. యాట్ రిట్రీట్ ' అని ఎంబాస్ చేశారు. ఆ జాకెట్ వల్లే నేను రతి, రిచ్ లను పట్టుకోగలిగాను. ఇక మానెక్ భాయి ని పట్టడానికి వేసిన వలలో ఇతనో చిరు చాపనే. హేమ హేమీలు చాలా మంది ఇన్సైడర్ ట్రేడింగ్ లో పట్టు బడ్డారు. నేను చెప్పిన మాటలకి అతనికి రాబోయే కొన్ని నెలలు నిద్ర ఉండదు. ఆ శిక్ష చాలు అతనికి."

"ఇంతకీ జాకెట్ సంగతే అంతుబట్టడం లేదు. అతనికి, జాకెట్ కి, రతికి, రిచ్ కి ఈ కేసు సాల్వ్ అవ్వడానికి సంబంధమేమిటి మహాశయా."

"అతను వేసుకున్న జాకెట్టునే, నేను రిచ్ వేసుకోవడం చూసాను."

"ఎంటి రిచ్ ఎందుకు ఈ ఆగంతకుడి జాకెట్ వేసుకుంటాడు? రిచ్ ని ఎక్కడ కలిసావు?"

"రిచ్ ని కలవలేదు. రిచ్ ని మీ చిట్టి పోస్టులో చూసి గుర్తుపట్టాను. రిచ్ కూడా ఆ పోస్ట్ లోఅదే జాకెట్ వేసుకున్నాడు."

"నువ్వు చిట్టి పోస్ట్ లో చూసింది వేగాస్ లొకేషన్ కదా? రిచ్ , రతి ఇక్కడ మాయమై, అక్కడ తేలారన్న మాట. కారణమేంటో?"

"రతి, రిచ్ లు ప్రభుత్వ సాక్షులు కావడానికి ఒప్పుకున్న తరువాత, అంతా కక్కేసారు. ఈ ఫ్రాడ్ బయటకు రాకుండా నడపడం కష్టం అని వారికి తెలిసిపోయింది. నువ్వు కనుకున్నట్లు క్యాష్ ఫ్లో సమస్యలు మొదలయ్యాయి. అప్పటికే బిజినెస్ తో పాటు వీరిద్దరికీ రిలేషన్షిప్ కూడా మొదలైంది. అదే నేను సర్వేయిల్లన్స్ వీడియోలలో వీరి ప్రవర్తనలలో గమనించాను. అందుకే అలా పారి పోయారు."

"మరి రెస్టారంట్ లో మనం కలిసిన ఆ బ్యాంకర్ జాకెట్, రిచ్ దగ్గరికి ఎలా వచ్చింది?"

" రిచ్ కూడా ఆ మానెక్ భాయి పార్టీ కి పోయి ఉంటాడు. అతనికి అలాంటిదే జాకెట్ అంది ఉంటుంది...," లారెన్స్ మాటలు చెప్తూ ఆపేసి, లక్ష్మి వంక చూసాడు.

లక్ష్మి కళ్ళలో కదులుతున్న మెరుపులు చూస్తూనే, లారెన్స్ కి తెలిసి పోయింది – లక్ష్మి కి కేసు ఎప్పుడో అర్థమైపోయిందని, కావాలనే తనను ఆట పట్టించడాని కే అలా మాటలు పొడిగిస్తున్నదని. రెస్టారెంట్లో కూర్చున్న మిగతావారు ఉల్లిక్కి పడి చూసేలా, లారెన్స్, లక్ష్మి ఒకే సారి పగల బడి నవ్వారు.

Post your comments